క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి పరామర్శ



గూడూరు: 103 సంవత్సరాలు ఆరోగ్యకరజీవనం సాగించి ఆగస్టు 19న కాలం చేసిన వైఎస్సార్ సీపీ గూడూరు మండల అధ్యక్షుడు సమ్మెట జయవర్ధన్ నాయనమ్మ సమ్మెట కుటుంబాయమ్మ కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము ఆదివారం పరామర్శించారు. కుటుంబాయమ్మ దశదిన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ముక్కొల్లు వచ్చిన రాము కుటుంబాయమ్మ చిత్రపటానికి పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, పార్టీ సీనియర్ నాయకులు గరికపాటి రామానాయుడు, కొండవీటి నాగబాబు, గోరిపర్తి రవికుమార్, మోటేపల్లి రత్నారావు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, లింగం విజయ్, బొర్రా సాంబయ్య, ఐనాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అఖండ మెహెర్‌నామ సంకీర్తనలు



చల్లపల్లి: గత మూడు రోజులుగా స్థానిక మెహెర్ బాబా మందిరంలో నిర్వహిస్తున్న అఖండ మెహెర్ నామ సంకీర్తనలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ఈ నెల 29వ తేదీ ఉదయం గం.7లకు ప్రారంభమైన కీర్తనలు నిరవధికంగా 60 గంటల పాటు సాగాయి. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మెహెర్ బాబా ప్రేమికులు సుమారు 200 మందికిపైగా పాల్గొని సంకీర్తనలు ఆలపించారు. బాబా వారికి మంగళహారతి పట్టి గీతాలు ఆలపించి కార్యక్రమాన్ని దిగ్విజయంగా ముగించినట్లు అధ్యక్షుడు చుండూరి ఎంవీఆర్‌కే సత్యప్రసాద్ తెలిపారు.

వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు రాము మృతి



బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు, స్థానిక పాల కేంద్రం అధ్యక్షుడు బొల్లా రాము (58) ఆదివారం మరణించారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంగా ఉన్న ఆయన ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్ (రాము) బొల్లా రాము మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేసి ధైర్యం చెప్పి అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు మారుతి ప్రసాద్, బండారు చంద్రశేఖరరావు, కమాల్ భాషా ఉన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఆధునికీకరణ పనులు



పెడన:పట్టణంలోని మెయిన్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ 15 సంవత్సరాలు కిందట ఏర్పాటు చేసినవి కావడంతో అవి తుప్పుపట్టి పడిపోయే పరిస్థితి ఏర్పడింది. వీటి స్థానంలో ఆధునికీకరణతో పటిష్టమైన విద్యుత్ స్తంభాలతో లైటింగ్ ఏర్పాటు చేయడానికి ప్రస్తుత పాలకవర్గం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం బస్టాండు వద్ద నుంచి మొదలు మున్సిపల్ కార్యాలయం మీదుగా గుడివాడ రోడ్డులోని కొంత దూరం వరకు ఏడు స్తంభాలను మార్చి వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడానికి రూ.6.70 లక్షలు నిధులు కేటాయించారు. ప్రస్తుతం ఈ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. త్వరితగతిన పనులు పూర్తిచేయడానికి పాలకవర్గం చర్యలు చేపట్టింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి చొరవతో మున్సిపల్ అజెండాలో పెట్టి ఆయా పనులు చేపడుతున్నారు. దీనిపై పురపాలక సంఘం ఏఈ కె.సీతారామాంజనేయులు మాట్లాడుతూ పాత వాటి స్థానంలో కొత్త స్తంభాలు వేయాలని పాలకవర్గం సూచించింది. ప్రస్తుతం జనరల్ ఫండ్స్ నుంచి మొదటి విడతగా రూ.6.70 లక్షలు కేటాయించామని తెలిపారు. ఏడు స్తంభాలు వేస్తున్నామని పేర్కొన్నారు. పాలకవర్గం సూచనల మేరకు నిధుల లభ్యతను బట్టి మిగిలిన మిగిలిన పాత స్తంభాలున్న చోట కొత్తవి వేయడానికి కృషి చేస్తామన్నారు.

వెళ్లిరావయ్యా.. బొజ్జ గణపయ్యా!

అన్నసమారాధనలు.. ఊరేగింపులు.. నిమజ్జనాలు



పెడన శివాలయం వద్ద భక్తుల నృత్యాలు

పెడన: గణపతి బొప్పా మోరియా...జై బోలో గణేష్ మహారాజ్‌కు అంటూ నినాదాలు చేస్తూ భక్తులు గణపతి ప్రతిమలను ఊరేగింపుగా నృత్యాలు చేసుకుంటూ భక్తులు నిమజ్జనాలకు బయల్దేరి వెళ్లారు. వినాయక చవతి నవరాత్రులను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల్లో, కూడళ్లలో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమలను ఏర్పాటు చేసిన చోట ఆదివారం ఐదో రోజున మధ్యాహ్నం అన్న సమారాధానలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని 15వ వార్డు జగపతి థియేటర్ రోడ్డులోను, బంగ్లాస్కూలు ఎదురుగా మిల్లు వద్ద బాలగణపతి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలోను, శివాలయం వద్ద గణపతి ప్రతిమలను ఊరేగింపుగా నిమజ్జనాలకు తరలించారు. బాలగణపతి ఫ్రెండ్స్ సర్కిల్ వారు ఊరేగింపులో చిన్నారుల కోలాటప్రదర్శన ఆకట్టుకుంది. పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్, ఎస్ఐ సత్యనారాయణ బందోబస్తు చర్యలు చేపట్టారు. స్థానిక 13వ వార్డు చోడుదిక్కుల కాలనీలో బాల గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతిప్రతిమను లక్షరూపాయలతో అలంకరించారు.

అన్నసమారాధన

కోనేరుసెంటర్: కృష్ణాజిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రులను పురస్కరించుకుని ఆదివారం పోలీసు క్వార్టర్స్‌లోని పందిరిలో అన్నసమారాధన నిర్వహించారు. గణనాథుడికి పోలీసుల కుటుంబాలు పూజలు నిర్వహించారు. ప్రసాదాలు సమర్పించారు. జిల్లా అడిషనల్ ఎస్పీలు బి.సత్యనారాయణ, వీవీ నాయుడు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అన్నసమారాధనలో భక్తులకు స్వయంగా వడ్డన చేశారు. తీర్థప్రసాదాలను అందించారు. బందరు డీఎస్పీ చప్పిడి రాజా, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు అన్న సమారాధనలో పాల్గొని వడ్డన చేశారు.



మచిలీపట్నం 3 స్తంభాల సెంటర్లో..



చల్లపల్లి మండలం రామానగరంలో చిన్నారుల సందడి

మచిలీపట్నంటౌన్: గణనాథుల విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు ఐదో రోజు ఆదివారం నగరంలో ఉత్సాహంగా సాగాయి. నగరంలో ప్రారంభమైన ఊరేగింపులు మంగినపూడి బీచ్ వరకు సాగాయి. డీజేలో సినిమా పాటలకు యువత కేరింతలు కొట్టి సందడి చేశారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని మూడు స్తంభాల సెంటర్లో వేంచేసి ఉన్న శ్రీ విజయ గణపతి ఆలయంలో గణనాథుని విగ్రహాన్ని యాపిల్ పండ్లతో అలంకరించారు. పెడన మండలం అచ్చయ్యవారిపాలెంకు చెందిన కోలాట బృందం చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. నగరంలోని రాజుపేట సాతాను బజారులో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ గణపతి స్వామి ఆలయంలో లాలా బాగ్‌కా బాదుషా భారీ గణనాథుని విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి సిద్ధేంద్ర నర్తన గ్రూపు బృందం చేసిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది.

చల్లపల్లి: మండల పరిధిలోని రామానగరంలో చిన్ని వినాయకుని ఊరేగింపు ఆదివారం సందడిగా నిర్వహించారు. ఈ ఊరేగింపులో చిన్నారుల సందడి అందరినీ ఆకట్టుకుంది.

రూ.60 వేలు పలికిన గణపతి లడ్డూ

చల్లపల్లి: స్థానిక ప్రధాన సెంటర్లోని శ్రీలక్ష్మీ గణపతి స్వామి ఆలయంలో గణేష్ ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం రాత్రి లడ్డూ వేలం నిర్వహించారు. 40 గ్రాముల వెండి వినాయకుని ప్రతిమతో కూడిన 38 కిలోల లడ్డూ ధర రూ.60500 పలికింది. గ్రామానికి చెందిన మార్గాని శ్రీనివాసరావు మనుమడు చిరంజీవి రియాన్స్ లడ్డూను దక్కించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు నర్రా సురేంద్ర, ఆత్మకూరి వెంకటేశ్వరరావు లడ్డూను అందజేశారు. మరో చిన్న లడ్డూ రూ.10.500 పలికింది.

పోలీసు బందోబస్తు మధ్య..

కోడూరు: మండలంలో సమస్యాత్మక గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల ఊరేగింపును పోలీసులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మండలంలోని మందపాకల గ్రామంలో ఏర్పాటు చేసిన లబోందరుడి విగ్రహాన్ని ఆదివారం నిమజ్జనానికి తరలించారు. గతంలో ఈ గ్రామంలో నిమజ్జన సమయంలో ఘర్షణలు చోటు చేసుకోవడంతో ఈ ఏడాది అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్ఐ చాణిక్యలు గణనాథుడి ఊరేగింపులో పాల్గొన్నారు. సంప్రదాయబద్ధమైన డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపు కొనసాగేలా చూశారు. విగ్రహాన్ని ఉల్లిపాలెం సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేసే వరకు సీఐ, ఎస్ఐ, సిబ్బంది విగ్రహం వెంటే ఉన్నారు.

కోడూరు: కోడూరులోని వడ్డెరకాలనీ, వీవర్స్‌కాలనీ, ఈబీసీ కాలనీల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలను ఆదివారం కోడూరు పురవీధులు వెంట ఊరేగించారు. జయపురం గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుడి ఊరేగింపు ముందు మహిళలు కోలాట భజనలు చేసి ఆకట్టుకున్నారు. విగ్రహాలను ఉల్లిపాలెంలోని కృష్ణానది వద్ద నిమజ్జనాలు చేశారు.

బంటుమిల్లి: మండలంలో ఆదివారం ఐదో రోజు నిమజ్జనాలు పెద్ద ఎత్తున జరిగాయి. మల్లేశ్వరం గ్రామం వద్ద బంటుమిల్లి ప్రధాన కాలువపై సందడి నెలకొంది. ఎస్ఐ గణేష్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కృత్తివెన్ను: మండలంలో గణనాథుల విగ్రహాల ఊరేగింపులు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం మండలంలోని యండపల్లి, చందాల, మునిపెడ తదితర గ్రామాలలో గణనాథులు వైభవంగా నిమజ్జనానికి తరలివెళ్లారు. యండపల్లి, చందాల, మునిపెడలలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. స్వామివారి లడ్డూలకు వేలం నిర్వహించారు.

నాగాయలంక: మండలం నుంచి ఆదివారం 17 విగ్రహాలను కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్ వద్ద కృష్ణానదిలో ఏడు పరిసర గ్రామాల నుంచి తరలి వచ్చిన వినాయక విగ్రహాలను నిమజ్జనం జరిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పడవలపై విగ్రహాలను నదిలో లోపలకి తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. స్థానిక తహసీల్దార్ సీహెచ్‌వీ ఆంజనేయప్రసాద్, అవనిగడ్డ డీఎస్పీ తాళ్ళూరి విద్యాశ్రీ శ్రీరామ పాదక్షేత్రం వద్ద విగ్రహాల నిమజ్జనాలను పరిశీలించారు. నిర్వాహకులకు సూచనలు చేశారు. నాగాయలంక ఎస్.ఐ కలిదిండి రాజేష్, వీఆర్ఓ భోగాది మల్లిక్, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు కోలాహలంగా సాగాయి. ఆదివారం ప్రత్యేకంగా ముస్తాబు చేసిన వాహనాలపై గణనాథులను ఊరేగిస్తూ తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. నిమజ్జనాలు చేసే కాల్వల దగ్గర విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఆదివారం మండల పరిధిలోని 25 విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఘంటసాల: ఘంటసాల తూర్పువైపు రామాలయంలో వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీపీ రజని కుమారి.. స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



పెడన చోడుదిక్కులలో రూ.లక్షతో అలంకరణ



గూడూరులో ఊరేగింపుగా..



నాగాయలంక శ్రీరామపాద క్షేత్రం వద్ద..



పోలీసు క్వార్టర్స్‌లో భక్తులకు వడ్డన చేస్తున్న ఏఎస్పీలు సత్యనారాయణ, వీవీ నాయుడు



నిమజ్జనానికి బయల్దేరిన మల్లేశ్వరం గణనాథుడు



మందపాకల విగ్రహం ఊరేగింపు వద్ద సిబ్బందితో సీఐ, ఎస్ఐ



ఘంటసాల తూర్పువైపు రామాలయం వద్ద విగ్రహానికి గ్రామోత్సవం

ఐవీఎం ట్రస్టు సేవలు స్ఫూర్తిదాయకం

విద్యార్థులకు 15 ల్యాప్‌టాప్‌లు, రూ.60 లక్షలు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



ల్యాప్‌టాప్‌లు అందుకున్న ఇంజినీరింగ్ విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

చల్లపల్లి: సహాయం పొందిన ప్రతి ఒక్కరూ చక్కగా చదివి తిరిగి భవిష్యత్తులో మరో పది మందికి సహాయం చేసే స్థాయికి ఎదగాలని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. గత 24 ఏళ్లుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ల్యాప్‌టాప్‌లు, వితంతువులకు, వృద్ధులకు నెలవారీ సరుకులు, దుస్తులు, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, పేదలకు వైద్య ఖర్చులు, నిరుద్యోగ యువతులకు కుట్టు శిక్షణ, మిషన్లు పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ (ఐవీఎం) ట్రస్టు డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్, రోజా దంపతులు అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. మండల పరిధిలోని పురిటిగడ్డ ఐవీఎం ట్రస్టు కేంద్ర కార్యాలయంలో ఆదివారం విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 15 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.7 లక్షల విలువగల 15 ల్యాప్‌టాప్‌లు అందజేశారు. అలాగే 175 మంది స్కూల్ పిల్లలకు రూ.20 లక్షలు, ఇంటర్, ఇంజినీరింగ్, యూనివర్సిటీల్లో చదివే 100 విద్యార్థులకు రూ.40 లక్షల స్కాలర్‌షిప్‌లను చెక్కుల రూపంలో బుద్ధప్రసాద్, నారాయణరావు ఇతరుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఘంటసాల మార్కెట్ యార్డ్ చైర్మన్ తోట కనకదుర్గ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోలెం నాగమణి, సీఐ కె.ఈశ్వరరావు, ఎస్ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, చల్లపల్లి గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ముమ్మనేని రాజకుమార్, ఐవీఎం ట్రస్టు ప్రతినిధులు స్వితిన్‌రాస్, సోఫీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం

కృత్తివెన్ను: మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న సోమేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం రాత్రి ఏర్పాటు చేసిన అభినందన సభలో పలువురు ఆయన సేవలను కొనియాడారు. అనంతరం తహసీల్దార్ దంపతులను పూలమాలలు, దుశ్శాలువా, నూతన వస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూనసాని గరుడ ప్రసాద్, మాజీ ఎంపీపీ వలవల సత్యనారాయణ స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పనిచేసే వారికి ప్రశంసలే అవార్డులు



చల్లపల్లి: పనిచేసే వారికి ప్రజల ప్రశంసలే అవార్డులని మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి అన్నారు. వీఆర్‌వో గొల్లపూడి రాజేంద్రకుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో ఆదివారం సన్మాన సభ నిర్వహించారు. డీఆర్ఓ సీసీ టి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆర్డీవో స్వాతి మాట్లాడుతూ వీఆర్‌ఓగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 17 సంవత్సరాలపాటు చల్లపల్లి మండలంలోనే బాధ్యతలు నిర్వర్తించే అవకాశం రాజేంద్రకుమార్‌కే దక్కిందన్నారు. అంతగా ప్రజల మన్ననలు పొందటమే గొప్ప బహుమానమన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, సర్పంచ్ పి.కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని రాజకుమార్, పంచాయతీ రిటైర్డ్ ఈఓఆర్డీ దాసి సీతారామరాజు, ఏఎస్ఓ పర్విన్, పంచాయతీ కార్యదర్శి పేర్ని మాధవేంద్రరావు తదితరులు రాజేంద్ర సేవలను ప్రశంసించారు. అనంతరం రాజేంద్ర, పద్మ దంపతులను సన్మానించారు.

మున్సిపల్ వార్డులకు ఉప ఎన్నికపై సమీక్ష



వార్డు ఉప ఎన్నికలపై సమీక్షిస్తున్న కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, టీపీవో తదితరులు

పెడన: పట్టణంలోని 11, 14వ వార్డులకు సంబంధించి ఉప ఎన్నికలపై మున్సిపల్ కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి ఆదివారం సమీక్షించారు. కమిషనర్ తన ఛాంబరులో టౌన్ ప్లానింగ్ అధికారిణి బి.సుజనకుమారితో కలిసి ప్లానింగ్ సెక్రటరీలు, ఆయా వార్డు సచివాలయాల సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయా వార్డులు రిజర్వేషన్లు లాస్ట్ టైమ్ జరిగిన మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లు, ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నివేదికలు ఉన్నతాధికారులకు పంపించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. 11వ వార్డులో 1,265, 14వ వార్డులో 1,156 మంది ఉన్నారని, ఈ సంఖ్య ఇంకా ఫైనలైజ్ కాలేదన్నారు. ఎన్నికల సంఘం ఇచ్చే ఆదేశాల మేరకు నివేదికలను సిద్ధం చేసి రెడీగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

చిన్నాకు నెహ్రూ జాతీయ సేవా పురస్కారం



జాతీయ సేవా పురస్కారాన్ని అందుకుంటున్న కొల్లూరి చిన్నా

పెడన: పట్టణ ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) కొల్లూరి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు (కేసీటీ) వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ (చిన్నా)కు దేశ ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జాతీయ సేవా పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. విశాఖపట్నంకు చెందిన ప్రతిభ క్రీడా సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ స్థాపించి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాల్లో విశిష్ట సేవలందించిన వారిని గుర్తించి వివిధ అవార్డులను అందజేశారు. ప్రతిభ క్రీడా సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి అడవి రాజు విశాఖపట్నం జిల్లా పౌర గ్రంథాలయంలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన విశాఖ మాజీ మేయర్ దాడి సత్యనారాయణ, దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ విశాఖ కళాపరిషత్ వ్యవస్థాపకుడు పీఏ భాస్కరరావు, సీనియర్ జర్నలిస్టు నేమాల హేమసుందర్‌రావు, ఆంధ్రప్రదేశ్ హైందవ ధర్మ ట్రస్ట్ సేవా అధ్యక్షురాలు విజయరమణి ప్రోగ్రాం కన్వీనర్ వర్రే నాంచారయ్య తదితరులు చిన్నాను సత్కరించి ప్రశంసా పత్రం, అవార్డును అందజేశారు. గత నాలుగు దశాబ్దాలకు పైగా పెడన పరిసర ప్రాంత పేద ప్రజలకు తన సొంత నిధులతో సేవలను అందిస్తున్న కొల్లూరి చిన్నాను గుర్తించి ఈ అవార్డును అందజేశారు.

మునిగిన పంటలతో అన్నదాతల ఆవేదన

- ప్రకృతి ప్రకోపానికి అల్లాడుతున్న రైతులు
- ప్రభుత్వ వైఖరిపై రైతుల్లో ఆగ్రహం



మల్లవోలు ప్రాంతంలో చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

గూడూరు:ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు ప్రకృతి ప్రకోపానికి అల్లాడిపోతున్నారు. దీనికి ప్రభుత్వ వైఖరి తోడవ్వడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. గత వారంరోజుల వ్యవధిలో గూడూరు మండలం మల్లవోలు పరిసర ప్రాంతాల్లో సంభవించిన పరిణామాలే దీనికి ఓ ఉదాహరణగా చెప్పవచ్చు.

ఎండిన పంటలు....

వారం రోజుల క్రితం వరకు వేసవిని తలపించిన ఎండలతో పంటలు మాడిపోయాయి. ప్రాజెక్టులు నిండుకుండల్లా నీటితో కళకళలాడినా ప్రభుత్వ వైఫల్యం కారణంగా చివరి భూములకు నీరు సరఫరా కాని పరిస్థితి. గూడూరు మండలంలోని మల్లవోలు చానల్ పరిధిలో దాదాపు వెయ్యి ఎకరాలు ఎండిపోయే పరిస్థితికి వచ్చింది. రైతులు అలో లక్ష్మణా అంటూ నీటి కోసం ఎదురు చూశారు. ఇలాంటి పరిస్థితిలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. పంటలకు వర్షాలు జీవం పోశాయని సంతోషపడ్డారు.

ముంపు బారిన పొలాలు....

వర్షాలతో రైతుల కళ్లల్లో కనిపించిన సంతోషం ఎంతో సేపు నిలువలేదు. వరుణుడు తనప్రతాపం చూపడంతో ఏకధాటిగా వర్షాలు కురిసాయి. దీంతో నేడు పంటలు ముంపు బారిన పడ్డాయి. మురుగు కాల్వల్లో గుర్రపుడెక్క, తూడు పెరిగిపోవడంతో ప్రస్తుతం పొలాల్లో నిలిచిన నీరు బయటకు పోవడానికి సమయం పట్టేట్లు ఉంది. దీంతో పొలాల్లో నిలిచిన నీరు బయటకు వెళ్లకపోవడంతో పైరు కుళ్లిపోయే పరిస్థితికి వచ్చిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సరైన సమయంలో కాల్వల నిర్వహణ చేపడితే రైతులకు ఇన్నికష్టాలు వచ్చేవి కావని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● గుడివాడ టౌన్: స్థానికకొత్తపేటలో శ్రీవిజయ దుర్గ అమ్మ వారి 18వ వార్షిక మహోత్సవం ఆదివారం నిర్వహించారు. కొత్తపేటకు చెందిన 108 మంది మహిళలు స్థానిక పామర్రు రోడ్డులోని పెద్దకాల్వ వద్దకు చేరుకుని ప్రత్యే క పూజలు చేశారు. కృష్ణానదీ జలాలను 108 బిందెలతో ఊరేగింపు గా అమ్మవారికిఅభిషేకాలు చేశారు. లోక కల్యాణార్థం ఈఅభిషేకాలు చేస్తు న్నామని అర్చకుడు హేమంత్ రవికుమార్ శర్మ తెలిపారు.